క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల: మండలంలోని రాయవరం సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రామయ్య మంగళవారం తెలిపారు. రాయవరం సబ్ స్టేషన్ పరిధిలో కొత్త లైన్ల నిర్మాణంలో భాగంగా రాయవరం, కంభంపాడు, ముత్యాలంపాడు, గోపాలపురం, రాయవరం ఇండస్ట్రియల్, ఆత్మకూరు అగ్రికల్చర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

దాచేపల్లి తహసీల్దార్‌గా మధుబాబు

దాచేపల్లి : మండల తహసీల్దార్‌గా జె.మధుబాబు బాధ్యతలు చేపట్టారు. పిడుగురాళ్ల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మధుబాబుకి దాచేపల్లి తహసీల్దార్(ఎఫ్ఐసీ)గా జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టి కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలతో మాట్లాడారు. రెవెన్యూ పరంగా ఉన్న సమస్యలపై చర్చించారు. డిప్యూటీ తహసీల్దార్ రాజా, ఆర్ఐ శరత్‌కుమార్ తదితరులు తహసీల్దార్‌ని సన్మానించారు.

సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు పొందవచ్చు

కమిషనర్ వేణుబాబు

మాచర్ల : పురపాలక సంఘ పరిధిలో ఏ సమస్య అయినా సమాచార హక్కు చట్టం కింద పూర్తి వివరాలు పొందేందుకు ప్రతి ఒక్కరికీ హక్కు ఉందని కమిషనర్ వేణుబాబు అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2025 నుంచి ప్రతి అంశంపై సమాచారం పొందవచ్చని అన్నారు. మొదటి అప్లియేట్ అధికారిగా తాను, పౌర సమాచార అధికారిగా పి.వెంగయ్య, సహాయ సమాచార అధికారిగా జహీర్‌బాషా వ్యవహరిస్తారన్నారు. సమాచారం కోసం 9849905838, 9849907309, 9948791955 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం



మాచర్ల : మాచర్ల పట్టణ శివారులోని బొంబాయి కంపెనీ వద్ద సుమారు 80 సంవత్సరాల గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం గుర్తించినట్లు పట్టణ సీఐ ప్రభాకరరావు మంగళవారం తెలిపారు. రెండు రోజుల క్రితం వృద్ధురాలిని గుర్తు తెలియని వారు వదిలి వెళ్లినట్లు సమాచారం. ప్రస్తుతం వృద్ధురాలి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచినట్లు సీఐ తెలిపారు. వృద్ధురాలి వివరాలు ఎవరికైనా తెలిస్తే వెంటనే 9440796240, 8639901698 నంబర్లకు తెలియజేయాలన్నారు.

నైట్ వాచ్‌మెన్, అటెండర్ పోస్టులను భర్తీ చేయాలని వినతి



గురజాల రూరల్ : గురజాల డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌మెన్, అటెండర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం అధ్యక్షుడు షేక్ బందం గిసాహెబ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చాలా సంవత్సరాల నుంచి తహసీల్దార్ కార్యాలయాల్లో నైట్ వాచ్‌మెన్, అటెండర్ విధులను రాత్రి, పగలు తేడా లేకుండా గ్రామ సహాయకులు నిర్వహిస్తున్నారని అన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకులు, పార్ట్‌టైం ఉద్యోగులు, వీఆర్ఏ విధులకు విరుద్ధంగా పని చేస్తున్నారని, దీనిపై స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏవోకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిచ్చయ్య, గురవయ్య, అమ్మిరెడ్డి, సాయిబాబు, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కారెంపూడిలో సీడ్ కోసం మొక్కజొన్న సాగు



కారెంపూడి: మొక్కజొన్న విత్తనాల కోసం కారెంపూడి మండలంలో 400 ఎకరాలలో మొక్కజొన్న పంట సాగవుతోంది. నాలుగు ప్రధాన కంపెనీలు వారి ఉద్యోగుల పర్యవేక్షణలో రైతులచే సాగు చేయిస్తున్నారు. ముందుగానే రైతులకు పెట్టుబడి ఖర్చులకు డబ్బులిచ్చి విత్తనాల కోసం సాగు చేయిస్తున్నారు. మొక్కజొన్న పైర్లు ఆశాజనకంగా ఉన్నాయి. ముందస్తు సాగు చేసిన పంటలు కోతలు కోస్తున్నారు. ఎకరాకు 30 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తోంది. కారెంపూడి మండలంతో పాటు పల్నాడులో పలు చోట్ల మొక్కజొన్న సీడ్ సాగు జరుగుతోంది. ఇదిలా ఉంటే సీడ్ కాకుండా మొక్కజొన్న సాగు మరో 300 ఎకరాలలో జరుగుతోంది. ఖరీఫ్‌లో పత్తి పంట పూర్తయిన తర్వాత రబీలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు.

ఒకే ఒక్క క్లిక్.. సేవలు మస్త్

- కూలీలచేతిలో బ్రహ్మాస్త్రం 'జన్‌మన్‌రేగా'
- 2017లో అందుబాటులోకి తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం
- యాప్‌లో ఉపాధి కూలీల సమగ్ర వివరాలు
- అక్రమాలపై ఫిర్యాదు చేసే అవకాశం
- యాప్‌పై అవగాహన లేక నష్టపోతున్న కూలీలు



పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

పిడుగురాళ్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పారదర్శకతను పెంచి అక్రమాలకు తావివ్వకుండా కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలను అమలు చేస్తోంది. ఒకే ఒక క్లిక్‌తో సకల సేవలు పొందేలా యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పనుల మంజూరు, నిర్వహణ, వేతనాలకు సంబంధించిన అనేక మార్పులు తీసుకొస్తోంది. కూలీల వేతనాలు దుర్వినియోగం కాకుండా నేరుగా బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఖాతాలను తెరిపించి జమ చేస్తోంది. అయితే వేతన జీవులు చాలా మంది తమ ఉపాధి బకాయిలు జమయ్యాయో.. లేదో.. ఒక వేళ జమైతే ఏ బ్యాంకులో పడ్డాయో తెలియక ఉపాధి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇలాంటి ఇబ్బందుల నుంచి గట్టెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం 'జన్‌మన్‌రేగా' యాప్‌ను 2017లో అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిపై అవగాహన లేక ఉపాధి కూలీలు నష్టపోతున్నారు. దీనిపై అవగాహన పెంచుకుని ఒకే ఒక్క క్లిక్‌తో ఉపాధి పనులకు సంబంధించిన సకల సమాచారాన్ని ఉపాధి కూలీలు పొందవచ్చు.

అవగాహన పెంచుకోవాలి


ఉపాధి కూలీలు ఈ యాప్‌పై అవగాహన పెంచుకుంటే అది వారి చేతిలో బ్రహ్మాస్త్రం అవుతుందని అధికారులు చెబుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యాప్‌పై క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించారు. అయినా కూలీలు సద్వినియోగం చేసుకోక నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించిన సంగతి తెలిసిందే. ఇలాంటి తరుణంలో జన్‌మన్‌రేగా యాప్ ద్వారా ఉపాధి పనుల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు వీలవుతుందని నిపుణులు చెబుతున్నారు.

యాప్ వినియోగం ఇలా...

స్మార్ట్‌ఫోన్‌లోని గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి జన్‌మన్‌రేగా అని టైప్ చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఇన్‌స్టాల్ చేసుకుని అందులో ఉపాధి జాబ్ కార్డు సంఖ్య నమోదు చేసి క్లిక్ చేస్తే కూలీల వివరాలు వస్తాయి. కూలీల పేరుపై క్లిక్ చేయగానే పని చేసిన రోజులు, వేతన బకాయిలు ఏ బ్యాంకు ఖాతాలో నగదు ఉంది.. తదితర వివరాలు స్పష్టంగా తెలుస్తాయి. వేతనం జమ కాకపోతే ఎందుకు జమ కాలేదో కూడా తెలుసుకోవచ్చు. ఉపాధి పనుల సమాచారం కూడా ఇందులో ఉంటుంది.

అక్రమాలపై ఫిర్యాదు చేయొచ్చు

కూలీల సొమ్ము స్వాహాతో పాటు ఇతర అక్రమాలపై కూడా జన్‌మన్‌రేగా యాప్ ద్వారా ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంది. క్షేత్రస్థాయిలో పని ప్రదేశాల్లో కూలీలతో కాకుండా యంత్రాలతో పనులు చేసినా, బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసినా నిధులు దుర్వినియోగం చేసినా, బోగస్ మస్టర్లకు పాల్పడినా యాప్‌లో ఫిర్యాదు చేస్తే నేరుగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి వెళ్తుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూరుస్తారు.



జన్‌మన్‌రేగా యాప్

యాప్‌పై అవగాహన కల్పిస్తాం



జన్‌మన్‌రేగా యాప్ వినియోగంపై కూలీలందరికీ క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తాం. సెల్ ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్, వినియోగం, తదితర అంశాలపై చైతన్య పరుస్తాం. కూలీలు కూడా ఈ యాప్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలి. ఎంతో ఉపయోగపడే ఈ యాప్‌ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి.

– రామచంద్రయ్య, ఎంపీడీవో, పిడుగురాళ్ల

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు



కల్యాణానికి హాజరైన భక్తులు

పిడుగురాళ్ల : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం 18వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం సీతారాముల కల్యాణం కనుల విందుగా జరిగింది. స్వామి వారి కల్యాణంలో పుణ్యదంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూలతో సీతారాములను అలంకరించి కల్యాణ వేడుకలు నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై కల్యాణ వేడుకలు తిలకించారు. సీతారాముల కల్యాణంతో పాటు సువర్చల ప్రసన్నాంజనేయస్వామి వారి కల్యాణం కూడా నిర్వహించారు. కల్యాణం అనంతరం రథోత్సవం ప్రారంభించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. స్వామి వారి తిరునాళ్ల పురస్కరించుకుని కులమతాలకు అతీతంగా పిడుగురాళ్ల పట్టణానికి ప్రత్యేక పండుగగా స్వామివారి కల్యాణం, రథోత్సవం జరిగింది.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న డీటీడబ్ల్యూ జ్యోత్స్న

వెల్దుర్తి: ప్రభుత్వం గిరిజన బాలికలకు అందిస్తున్న భోజనాన్ని మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని డీటీడబ్ల్యూ కె.జ్యోత్స్న అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శిరిగిరిపాడు గ్రామంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. మంచి భవిష్యత్తును ఏర్పరచుకోవాలన్నారు. విద్య అభివృద్ధి చెందినప్పుడే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మార్చిలో జరగనున్న 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థినులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా వడ్డించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలి

విద్యుత్ శాఖ డివిజనల్ ఈఈ సింగయ్య



మాచర్ల: మాచర్ల డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో విద్యుత్ శాఖ పరిధిలో రూ.కోట్ల బకాయిలు ఉన్నాయని, వెంటనే విద్యుత్ బకాయిలు చెల్లించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని విద్యుత్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింగయ్య కోరారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు, అన్ని శాఖలతోపాటు, వ్యాపార సంస్థలు, అన్ని రంగాల బకాయిలు పేరుకుపోయి ఉన్నాయన్నారు. దీని వల్ల ఇబ్బందిగా ఉన్న అంశాన్ని గమనించి ప్రతి ఒక్కరూ విద్యుత్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ నెలలో మూడు రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి బకాయిల వసూలుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు. సబ్ డివిజన్ పరిధిలోని డివిజన్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, లైన్‌మెన్‌లు, సిబ్బందితో చర్చించారు.

భక్తులకు మెరుగైన సేవలు అందించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

సత్రశాల(రెంటచింతల): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రమైన సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి వారిని దర్శించుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన సేవలు అందించాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక దేవస్థానం ప్రాంగణంలో ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతిక్షణం అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో దైవదర్శనం చేసుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సత్రశాల వరకు రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. మంచినీటి సౌకర్యం, దేవస్థానం పరిసర ప్రాంతాలను శుభ్రం చేయాలన్నారు. వృద్ధులకు, నడవలేని వారికి ఆటోలను, కృష్ణానదిలో స్నానాలు చేసేందుకు సౌకర్యాలను కల్పించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పార్కింగ్‌కు ఏర్పాట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ముందుగా దేవస్థానంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సమావేశంలో గురజాల ఆర్డీవో వి.మురళీకృష్ణ, పరాశక్తి జనరల్ మేనేజర్ ఎంఎస్ఎన్ రాజు, ఏపీ జెన్‌కో టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఎస్ఈ కె.వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య, ఎంపీడీఓ కె.సరోజినిదేవి, ఏపీ ట్రాన్స్‌కో ఏఈ మస్తాన్‌వలి, పీఆర్ఏఈ వెంకటేశ్వరరెడ్డి, ఆర్‌డబ్ల్యూ ఏఈ వెన్ను వెంకటేష్, ట్రస్ట్ బోర్డు సభ్యులు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయం కోసం కోర్టును సంప్రదించాలి

మాచర్ల : ఉచిత న్యాయం కోసం మండల న్యాయ సేవా కమిటీ మాచర్ల కోర్టు భవనంలో సంప్రదించాలని అదనపు సివిల్ జడ్జిలు శ్రీనివాస్ కళ్యాణ్, ప్రశాంత్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత న్యాయ సహాయం పొందాలంటే మాచర్ల కోర్టులో సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారాలు పొందవచ్చు అన్నారు. టోల్ ఫ్రీ నంబరు 15100 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. 08642-222165 నంబరులో సంప్రదించాలన్నారు.

పంట నమోదు చేసుకోవాలి



మాచవరం: పంటలు సాగు చేస్తున్న రైతులు పంట నమోదు చేసుకొని, ఈ కేవైసీ చేయించుకోవాలని ఏఓ కె.రామమ్మ తెలిపారు. మండలంలోని తురకపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కంది, వరి, పొగాకు, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. పురుగు, తెగుళ్ల నివారణకు యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాబువలి, వ్యవసాయ సహాయకులు కృష్ణవేణి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పెరిగిన ధాన్యం ధర



కారెంపూడి: ధాన్యం ధర పెరిగింది. బీపీటీ రకం బస్తా ప్రస్తుతం రూ.1,700 పలుకుతోంది. సరిగ్గా నెల క్రితం రూ.1,400 పలికిన బీపీటీ రకం ధర ఇప్పుడు అమాంతం పెరిగింది. ధాన్యం నాణ్యతగా ఉంటే రూ.1,800కు కూడా కొంటున్నారు. ధాన్యం నిల్వ చేసుకున్న రైతులు అమ్ముతున్నారు. రైతులకు వంద బస్తాలకు రూ.30 నుంచి రూ.40 వేలు అధిక ధర లభిస్తోంది. దాదాపు 95 శాతం మంది రైతులు వచ్చిన ధాన్యం వచ్చినట్లుగా అమ్మేశారు. డబ్బుకు ఇబ్బంది లేని రైతులు మాత్రం తక్కువ ధరకు అమ్మడం ఇష్టం లేక స్టాకు పెట్టుకున్నారు. స్టాకు పెట్టుకున్న వారికి ప్రస్తుతం ధర కలసి వస్తోంది.

సాగర్ కాల్వ కట్టపై కంప చెట్ల తొలగింపు



కారెంపూడి: సాగర్ కుడి కాల్వ కరకట్టపై అల్లుకున్న కంప చెట్లు తొలగిస్తుండడంతో కాల్వ కట్ట రైతుల రాకపోకలకు అనువుగా సౌకర్యవంతంగా తయారైంది. చాలా రోజులుగా మనిషి నడిచేందుకు కూడా వీలు కాకుండా కంప చెట్లు అల్లుకున్నాయి. ఇక కాల్వ పర్యవేక్షణకు అధికారుల వాహనాలు రావడానికి అసలు వీల్లేకుండా ఉండడంతో పాటు కాల్వ కట్టకు కూడా చెట్లు పెద్దవి కావడం వల్ల బలహీనపడే ప్రమాదం ఏర్పడింది. ఈ దశలో కాల్వ కట్టపై ఉన్న కంప చెట్లు తొలగించడంతో కాల్వ కట్ట విశాలంగా సౌకర్యవంతంగా దర్శనమిస్తోంది.

అభివృద్ధి పనులు శరవేగంగా జరిపించాలి

డీఎల్‌డీవో గబ్రూనాయక్



మాట్లాడుతున్న డీఎల్‌డీవో గబ్రూనాయక్

దాచేపల్లి : ప్రభుత్వం ద్వారా చేపట్టే అభివృద్ధి పనులు శరవేగంగా జరిపించాలని డీఎల్‌డీవో గబ్రూనాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం మంగళవారం జరిగింది. గ్రామాల వారీగా చేపట్టే అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రభుత్వంతో పాటు గ్రామ పంచాయతీ, మండల పరిషత్ ద్వారా విడుదలైన నిధులను సక్రమంగా సద్వినియోగం చేయాలని, గుర్తించిన పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనుల్లో వేగం పెంచాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలని, వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పప్పుల రత్నం, ఈవోపీఆర్డీ గుప్తా పాల్గొన్నారు.

ఉత్తమ అధికారికి సన్మానం



ఎంపీడీఓ సరోజినిదేవిని సన్మానిస్తున్న మాచర్ల వాసవీ క్లబ్ సభ్యులు

రెంటచింతల: అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేసే అధికారులను పురస్కారాలు తప్పక వరిస్తాయని మాచర్ల వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు అన్నారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎంపీడీఓగా కలెక్టర్ పి.అరుణ్ బాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్న సరోజినిదేవిని మాచర్ల వాసవీ క్లబ్ సభ్యులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా చెన్నకేశవరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎప్పుడూ ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు, స్థానిక అధికారులకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి సరోజినిదేవి విశేషంగా కృషి చేశారన్నారు. మరిన్ని ఉత్తమ అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సరోజినిదేవి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ పనులను స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో రాజీ పడకుండా అంకిత భావంతో చేపట్టడం వలన తనకు ఈ గౌరవం దక్కిందన్నారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భవనాసి రవితేజ, బత్తుల బ్రహ్మం, కోశాధికారి బచ్చు రాజ్‌కుమార్, సభ్యులు గంగిశెట్టి రాధాకృష్ణ మూర్తి, పందిరి నరసింహారావు, చుండూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

చోరీకి గురైన ల్యాప్‌టాప్ అందజేత



ల్యాప్‌టాప్ అందిస్తున్న జీఆర్పీ పోలీసులు

దాచేపల్లి : రైలులో చోరీకి గురైన ల్యాప్‌టాప్‌ని జీఆర్పీ పోలీసులు గుర్తించి బాధితులకు మంగళవారం అందజేశారు. నడికుడి జీఆర్పీ ఎస్ఐ వి.శ్రీనివాసరావు నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్లకి చెందిన చింతల కిరణ్మయ్ ఈ నెల 23న జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు వస్తుంది. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటం వలన గుర్తు తెలియని వ్యక్తులు కిరణ్మయ్ వద్ద ఉన్న ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగ్‌ని చోరీ చేశారు. ల్యాప్‌టాప్ చోరీకి గురైనట్లు గుర్తించిన కిరణ్మయ్ నడికుడి జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ శ్రీనివాసరావు నాయక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. గురజాలలో ఓ దుకాణం వద్ద బ్యాగ్ ఉన్నట్లు జీఆర్పీ పోలీసులకు సమాచారం అందింది. అక్కడికి వెళ్లి ల్యాప్‌టాప్, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని కిరణ్మయ్‌కి ఎస్ఐ శ్రీనివాసరావు అందజేశారు. ల్యాప్‌టాప్ చోరీ చేసిన వ్యక్తి ఆచూకీ తెలియాల్సి ఉందని ఎస్ఐ చెప్పారు. ఎస్ఐ వెంట ఏఎస్ఐ వెంకట్రావ్, కానిస్టేబుల్ రామరాజు ఉన్నారు.

భద్రత ప్రాణాలు కాపాడుతుంది

ఎంవీఐ శేషురెడ్డి



మాట్లాడుతున్న ఎంవీఐ శేషురెడ్డి

దాచేపల్లి : భద్రతే మనిషి ప్రాణాలు కాపాడుతుందని ఎంవీఐ డి.శేషురెడ్డి అన్నారు. గామాలపాడు సాగర్ సిమెంట్స్ కాలనీలో రోడ్డు భద్రత మాసోత్సవాలు మంగళవారం నిర్వహించారు. రోడ్డు భద్రతపై కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఎంవీఐ శేషురెడ్డి మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అజాగ్రత్తతో వాహనాలు నడపటం వలన విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. రోడ్డుపై రాకపోకలు సాగించే సమయంలో సహనం, ఓర్పు కలిగి ఉండాలని, అతివేగం ప్రాణాలు తీస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ శ్రావ్య, ప్లాంట్ హెడ్ సుబ్బారావు, అధికారులు రామకృష్ణ, శంకర్‌నారాయణరెడ్డి, గణేష్, నాగభూషణం, వీరప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల ప్రదర్శనకు అందరూ సహకరించాలి

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



ఎద్దుల ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల: ఎంతో కరుణ కలిగిన తల్లి కానుకమాత ఆశీస్సులు పల్నాడు ప్రజలందరికీ ఉండాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఫిబ్రవరి 2 నిర్వహిస్తున్న స్థానిక కానుకమాత చర్చి 175 వజ్రోత్సవ తిరునాళ్ల పురస్కరించుకుని మంగళవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 175 సంవత్సరాల నుంచి కానుకమాత తిరునాళ్ల వైభవంగా నిర్వహించడం సంప్రదాయంగా వస్తుందన్నారు. రైతు సోదరులకు ఎద్దుల బల ప్రదర్శన వలన ఉత్సాహం.. ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎద్దుల ప్రదర్శన జరిగేందుకు ప్రతి ఒక్కరూ కమిటీ వారికి సహకరించాలని కోరారు. కంది రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం క్వింటాకు రూ.1000 అదనంగా ఇవ్వడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముందుగా కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ వైల్ మర్రెడ్డి, రె.ఫాదర్ పీటర్ పాపయ్య, రె.ఫాదర్ ఎలీషారాజు, కమిటీ సభ్యులతో కలిసి జ్యోతి ప్రజ్వలన, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కమిటీ సభ్యులు అల్లం ప్రతాప్‌రెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, వైఎల్ మర్రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, బొడపాటి రామకృష్ణ, ఓరుగంటి ఇన్నారెడ్డి, మూలి రాజారెడ్డి, ఎం.చిన శౌర్రెడ్డి, గాదె కస్పారెడ్డి, కొమ్మారెడ్డి జోసఫ్‌రెడ్డి, పి.రాజారెడ్డి, వెన్నా కోటిరెడ్డి, మూలి రాయపరెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దాచేపల్లి : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ పాపారావు తెలిపారు. దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామ సమీపంలోని సిక్కుల దాబా వద్ద జరిగిన ప్రమాదంలో గురజాల మండలం పులిపాడుకి చెందిన ఓర్సు నరసింహారావు (34) మృతి చెందారని ఆయన చెప్పారు. ప్లంబర్‌గా పని చేసే నరసింహారావు సోమవారం ద్విచక్ర వాహనంపై పొందుగల వైపు నుంచి వస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ పాపారావు వెల్లడించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.